


# మా నాన్నకి ట్రాన్స్ఫర్ చెయ్యిరా దేవుడో !

మళ్లీ స్కూళ్లు తెరిచేటప్పటికి నేను ఫిఫ్త్ ఫారంలోకి కదా వచ్చిందీ ! అంటే మాటలు కాదు. మమ్మల్ని టీచర్లంతా బిగ్ గరల్స్ అని పిలుస్తూ అయినదానికీ కానిదానికీ తిడుతూ వుంటారు. నన్ను మానీటరుగా వుండమని అడిగారు గానీ నేనొప్పుకోలా - అందరితో విరోధాలొస్తాయని ! నేను 'ఏ' సెక్షన్ అంటే మేం బాగా చదివే పిల్లలమన్నమాట. బి సెక్షన్ అంటే

కొంచెంమొద్దులు. సి అంటేమరీమొద్దులూను. నిరుడు పరీక్షతప్పిన పిల్లలు కూడా సిసెక్షనే! వాళ్లనలా వేరే క్లాసులో కూచోపెట్టి చెప్పిందే చెప్పి రాయించిందే రాయించి నరకయాతనలు పెడుతూ వుంటారు.

ఈ ఎండాకాలం సెలవుల్లో మా క్లాసులో చాలా మంది అమ్మాయిలకి పెళ్లిళ్లయి పోయాయి. పట్టులంగాలు కట్టుకుని ఓణీలేసుకుని పెద్ద పెద్ద మంగళసూత్రాలేసుకుని క్లాసుకి వస్తుంటారు. ''ఇంత తొందరగా పెళ్లయిపోయిందా?'' అంటే 'ఏం చెయ్యం! నా పెళ్లయితే గాని మా బామ్మ చచ్చిపోదుటా' అని అందరూ ఒకటే మాట.

మరి అత్తారింటికెళ్లలేదేం అంటే అప్పుడే కాదు. ఎస్. ఎస్. ఎల్.సి పరీక్షలయేవరూ అమ్మ దగ్గిరే అని మాతో ఆటల్లో పడిపోతారు. వాళ్లకేం ధగధగ మెరిసిపోతూ వాళ్లు బాగానే వుంటారు గానీ వాళ్లతో ఆడాలంటే నాకే చచ్చే సిగ్గనిపిస్తుంది. ఇంకా నయం, మాకు బామ్మగారు లేకపోబట్టి సరిపోయింది. అయినా మా నాన్న వప్పుకోరనుకో! కావాలంటే నువ్వు చేసుకో మళ్లీ పెళ్లని చెప్పి హాయిగా నవ్వుకుంటూ ఆఫీసుకెళ్లిపోతారు.

ఇప్పుడు మా క్లాసులో నలుగురు భారతులూ, అయిదుగురు సుశీలలూ, ముగ్గురు స్వరాజ్యలక్ష్మిలూ, ముగ్గురు ఇందిరలూ వున్నారు. నన్ను రేడియో సుశీలంటారు. ఎందుకంటే నిరుడంతా మా ప్రిన్సిపాల్ మిస్ మల్లన్ గారు రేడియోలో ఇంగ్లీషు గ్రామరు నేర్పుతుంటే నేను స్టూడెంటుగా నటించేదాన్ని కదా! కొంచెం పాఠం చెప్పి ఆవిడ మన్ని ప్రశ్నిస్తే మనకి సమాధారం తెలిసినా తప్పు చెప్పాలి. అప్పుడావిడ ఇంకో పది నిమిషాలు పాఠం చెప్పి మనచేత నాలుగుసార్లు సరిగ్గా అనిపిస్తారు. ఆ పని చేసినందుకు రేడియో వాళ్లు నాకు అయిదు రూపాయలిస్తారు. ఆ డబ్బు తీసికెళ్లి అమ్మ దగ్గిర ఎన్ని బేరాలు పెట్టచ్చునో! అమ్మకి విసుగొచ్చి నువ్వూ నీ అయిదు రూపాయిలూ గంగలో దూకండనే వరకూ సినిమాకెళ్లడం దగ్గిర్నించీ ముత్యాల గొలుసు వరకూ అడుగుతూనే వుంటాగదా మరి!

మా ప్రిన్సిపాలు గారు మాకు నిజంగా గ్రామరు చెప్పడానికి కూడా క్లాసుకి వస్తారు. ఎవరికయినా వంట్లో బాలేకపోతే మనం చుట్టాలని తొందరగా వచ్చేయండని ఇచ్చే టెలిగ్రాంలని ఎంత ఎక్కిరిస్తారో ఆవిడ!

''మదర్ సీరియస్ - అంటే ఏమిటి ? కోపంగా వుండి ఎవరితోనూ మాట్లాడడం లేదనా? మదర్ డేంజరస్ - అంటే అమ్మ అందరినీ కొడుతోందనా ? చాలా తప్పు ! మదర్ సీరియస్‌లీ ఇల్ - మదర్ డేంజరస్‌లీ ఇల్ అనాలి'' అంటారు. అసలే అమ్మకి వంట్లో బాలేక అందరూ బాధపడుతుంటే ఈ ఇంగ్లీషు గ్రామరు ఎలా గుర్తొస్తుందీ - మళ్లీ ప్రతీ టెలిగ్రాంకి ఇంకో రూపాయి ఖర్చు పెట్టాలంటే మాటలా ! ఆవిడకేం ఎన్నన్నా చెప్తారు. అప్పటికప్పుడు

ఎదురు ప్రశ్న లేయకుండా అర్థమయినట్లు మొఖం పెట్టేస్తే సరి.

మా క్లాసులో నలుగురు భారతుల్లో ఏ. భారతని ఓ అమ్మాయుందిలే ! చాలా అందంగా ఉంటుంది. పైపెచ్చు వాళ్లింట్లో పూస్తున్నాయని రోజూ ఓ గుండు మల్లెపువ్వో, గులాబి పువ్వో టీచర్లకి పట్టుకెళ్లి ఇస్తుంది. అదే కారణమని అనలేం కానీ, ఎందుకో మరి అన్నిటిల్లో ఫస్టు మార్కులూ తనకే ! తెలిసీ తెలియకుండా ఎవరి గురించయినా చెడ్డగా అనుకుంటే ఆరు వేల పాపాలొస్తాయట కదా ! ఏవయినా తనుండగా నాకు మళ్లీ ఎప్పుడన్నా ఈ స్కూల్లో ఫస్టొస్తాననే ఆశే లేకుండా పోయింది. మా స్కూల్లో కుట్టుపని క్లాసుందనుకో! వహీదంత గొప్ప టైలర్లయి పోవాలన్నట్టు కుట్టిస్తారు. అలాగే సంగీతం క్లాసుంటే రేపో మాపో ఆలిండియా రేడియోలో కచేరీ వుందేమో అన్నట్లు అరిపిస్తారు. పైపెచ్చు నెల పరీక్షల్లో మార్కులు లెక్కలకీ పదే, కుట్టు పనికీ పదే. ఏవీ తేడా లేదు. ఈసారి ఎంతో కష్టపడి అన్ని సబ్జెక్టుల్లోనూ భారతికి సమానంగా వచ్చా. ఇంక కుట్టుపని ఒక్కటీ నెగ్గితే చాల్రా దేవుడా అనుకుంటూ స్కూలుకెడితే ఏం వుందీ ! నేను చచ్చీచెడీ చిన్నారి కాళ్లా వేళ్లాపడి కుట్టించిన టేబిలు క్లాతుకి పదికీ నాలుగున్నరేశారు. భారతికి ఎనిమిదేశారు. ఇంక నాకు ఏడుపు రాక ఏం వస్తుందీ !

సగం ఏడుపు ! సగం కోపంతో వెళ్లి ఆ టీచరుతో దెబ్బలాటేసుకున్నా, ''ఈ టేబిల్ క్లాతుకు ఏం తక్కువయింది టీచర్! నాలుగున్నరేశారు ? ఎంత కష్టపడి కుట్టానో'' అంటే - ''ఇది నువ్వు కుట్టినట్లు లేదు ! మీ అమ్మచేత కుట్టించుంటావ్! నువ్వెంత బాగా కుడతావో నాకు తెలుసులే, ఇంకోసారిలా అడిగావంటే ఎదురుగా కూచోపెట్టి కుట్టిస్తా'' ననేటప్పటికి భయం వేసి నోరు మూసుకుని వచ్చేశాను.

ఆ విసుగులో ఇంటికొచ్చేటప్పటికి అమ్మ చెప్పిన కబురు వడగళ్ల వానలా హాయిగా అనిపించింది. మాకు మద్రాసు ట్రాన్స్ఫరయి పోయిందిట. ఎప్పట్లానే రెండ్రోజుల్లో సామానంతా కంపెనీ లారీల్లో పంపేసి మేం వెళ్లిపోవాల్ట. ఇంక చూస్కో మర్నాడు బడికి ఎగ్గురు కుంటూ వెళ్లి అందర్నీ పిల్చి మరీ చెప్పాను! ''ఈ వూళ్లో చదువులు అంత బాగా లేవబ్బా ! అందుకని మా నాన్నగారు మద్రాసులో చదివిస్తానంటున్నారు! అక్కడయితే రోజూ కదంబం పెట్టుకోవచ్చు తల్లో! సంగీతం కూడా నేర్పిస్తారుట. ఇంక ఎల్లుండో ఎప్పుడో టిసిలు తీసుకుంటాం'' అని.

మా ఫ్రెండ్సంతా వెళ్లి భారతికి చెప్పారు. 'సుశీలకీ స్కూలు నచ్చలేదుటా. మద్రాసెళ్లి చదువుకుంటుందిటా'' అని. తనేం అనకుండా నవ్వి వెళ్లిపోయింది, అంటే నేనబ్బం చెప్పినట్లే కదా!

చల్లా అత్తయ్యగారి గిన్నెలతో వండుకోవచ్చులే అని సామాన్లయితే లారీలో పంపేశాం గానీ టి.సిలు తీసుకోడానికి అమ్మ ఒప్పుకోలే! ''ఎలా పడితే అలా వెళ్లిపోడం కాదూ! పెద్ద క్లాసులోకి వచ్చారు కదా! నాన్న మద్రాసు స్కూళ్లల్లో మాట్లాడొచ్చాకే టిసిలు తీసుకోండీ! ఈ లోపల నోరుమూసుకుని రోజూ బడికెళ్లండీ'' అని ఆర్డరేసింది.

చచ్చినట్లు రోజూ బడికెళ్లేవాళ్లం వచ్చేవాళ్లం. కానీ నాకయితే అసలు చదువుమీదే శ్రద్ధ పోయింది. ఇక్కడింత కష్టపడి తెలుగు నేర్చుకున్నాం అనుకో. అక్కడ అరవం చదవమంటే అంతా వేస్టే కదా! కానీ ఎంత ఎదురు చూసినా నాన్న దగ్గిర్నించి వుత్తరవూ లేదు. పత్తరవూ లేదు.. వున్నట్టుండి ఓరోజు పొద్దున్నే నాన్నే దిగబడ్డారు.

''ఏంటి నాన్నా! ముందుత్తరం రాస్తే మేం అంతా రెడీగా వుండేవాళ్లం కదా!''

''అంటే ఏవీ రెడీగా వుండక్కర్లేదురా! మన కంపెనీకి మద్రాసు కాంట్రాక్టు రాలేదు. ఇంకెక్కడయినా పనొచ్చే వరకూ నన్ను మళ్లీ ఇక్కడే వుండి బారేజీకి మిగిలూ తగులూ పన్లు చూడమన్నారూ'' అని హాయిగా ఆఫీసుకెళ్లిపోయారు.

ఇంక చూస్కో స్కూల్లో నా పాట్లు. అందరూ ముఖ్యంగా భారతి ఫ్రెండ్సంతా నన్ను పీక్కు తినేయడవే! ''ఇంకా ఎప్పుడు వెడతారూ మద్రాసూ! మన బడి బాగా లేదన్నావుగా! మద్రాసయితే సంగీతం నేర్చుకుంటానన్నావుగా'' అని. అసలే నామీద పగపట్టి వున్నారేమో నన్ను వదుల్తారా. ఎప్పటెప్పటి కక్షలో తీర్చుకోరూ! ఇలా కాదని చెప్పి ఓ రోజల్లా ఆలోచించి వుపాయంగా చెప్పా!

''మా నాన్నగారికి ఆ వూరు నచ్చలేదుటబ్బా. ఒకటే దోమలుట. మలేరియా వస్తుందేమో. బెజవాడే నయం. కాస్త ఎండలెక్కువయినా వుక్కపోయదు. అయినా మీరు శ్రద్ధగా చదువు కుంటారు కదా! ఏ స్కూలయితేనేం అన్నారు'' అని మళ్లీ ఓ పెద్ద కథ అందరూ వుండగా చెప్పి వూరుకోబెట్టా. నాతో పెట్టుకోలేక పైకేం అనలేదు గానీ వెనకాతల నవ్వుకునే వుంటారని నాకయితే అనుమానవే!

ఇంక నే చేసిన పని వల్ల నాకు స్కూల్లో దర్జాగా తిరిగే అదృష్టం పోయింది. ఏవిట్రా వుపాయం అని భాగ్యమ్మ నడిగితే ''మీ నాన్నకి మళ్లీ ట్రాన్స్ఫరయి పోయే వరకూ శనివారాలుంటా ననివెంకటేశ్వరస్వామికిమొక్కుకో! పెద్దకష్టవేం వుండదులే. రాత్రిళ్లు అన్నం బదులు తినగల్గినంత టిఫిను తినచ్చు. మళ్లీ పన్నెండు దాటితే అన్నం తినేయచ్చు!'' అనిసలహా చెప్పింది.

సరేమొక్కుకోడం అంటేమనసులోనే కాబట్టి ఎవరికీ తెలియదు గానీ అమ్మకి తెలియకుండా రాత్రిళ్లు టిఫిన్లెలా వస్తాయి? పైగా ట్రాన్స్ఫరయేందుకు పూజలు చేస్తున్నానని తెలిస్తే

అమ్మ పాతెయ్యదూ ! చచ్చీ చెడీ ఓ వారం పూరీలు తినాల్నుందని చెప్పీ, ఇంకో వారం దోసెలు తినాల్నుందని చెప్పీ రెండు మూడు వారాలు లాగించాను గానీ ఇంక ఆ తర్వాత అడగడం నా వల్ల కాలే. పన్నెండయే వరకూ ముసుగెట్టి పడుకుని పన్నెండు కొట్టగానే వంటింట్లోకి పరిగెత్తి తూము దగ్గర దుర్గ కోసం అట్టిపెట్టిన అన్నం తినేసి వచ్చి పడుకోడం.

మళ్లీ శనివారం పిండి పులిహోర చేసుకుందావా అమ్మా అని అడిగే లోపలే అమ్మ గయ్యి మంది. ''ఎంత పెద్దవుతున్నా నీకింత బుద్ధి కూడా రాలేదు! ఏడాది మధ్యలో చదువులు స్కూళ్లు మారాలంటే ఎంత కష్టవో తెలుసా ! పైపెచ్చు నియమాలోటా నీ మొఖానికి! నువ్వు టిఫిను తింటే ఏవిటి అన్నం తింటే ఏవిటి పన్నెండు దాటాక ! వెంకటేశ్వరస్వామికిదే పనా! చంపేస్తా నోరు మూసుకుని అందరితో బాటు అన్నానికి రా!'' అని. ఎప్పుడో తెలివి తక్కువగా ఏ చిన్నారి ముందో నోరు జారి వుంటాను. నాకు తిట్టవరస పడ్డాయి.

అమ్మ తిడితే తిట్టింది గానీ నేను మనస్పూర్తిగా నియమం తప్పకుండా చేసిన శనివారం వ్రత మహాత్యం వల్ల ఎంచక్కా అమ్మమ్మా తాతగారూ మావయ్యా అందరూ వున్న హైదరాబాదుకి వెళ్లమని నాన్నకి ఆర్డర్లొచ్చేశాయి. మళ్లీ రెండ్రోజులు స్కూల్లో వో వెలుగు వెలిగి బెజవాడకి టాటా చెప్పా!